అయిజలో కుక్కల స్వైరవిహారం

- భయాందోళనలో పట్టణ ప్రజలు
- వెయ్యి మందికి పైగా కుక్కకాటు బాధితులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



మున్సిపల్ కార్యాలయం ముందు నిద్రిస్తున్న వీధి కుక్కలు



కమతం పేటలో తిరుగుతున్న వీధి కుక్కలు

అయిజ: మున్సిపాలిటీలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనపడిన ప్రతి ఒక్కరిని కరుస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు పాఠశాలలకు వెళ్లేందుకు జంకుతున్నారు. మున్సిపాలిటీలో ఏడాది వ్యవధిలోనే సుమారు 1000 మందిని కుక్కలు దాడిచేశాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కుక్కల బారి నుంచి కాపాడండి మహాప్రభో అంటూ ప్రజలు మొత్తుకుంటున్నా అటు అధికారులుగాని ఇటు పాలకులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీలో సుమారు 400 నుంచి 500 వరకు వీధికుక్కలు సంచరిస్తుండంతో ఎప్పుడు దాడి చేస్తాయోనని భయాందోళనలో ప్రజలు ఉన్నారు.

నిత్యం ఏదో ఒకచోట దాడి..

గతేడాది 818 మందిని వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి రెండు నెలల్లోనే 103 మంది వీధికుక్కల బారిన పడ్డారు. మున్సిపాలిటీలో ఈనెల 6న ఒక్కరోజే 8 మందిపై పిచ్చి కుక్క దాడి చేసింది. అయిజ పట్టణానికి చెందిన 10 సంవత్సరాల హరికృష్ణను పిచ్చి కుక్క కరవడంతో ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. చేతివేలు విరిగిపోయింది. అయినా సరే మున్సిపల్ అధికారుల్లో ఉలుకు పలుకు లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. వీధికుక్కలకు ఏబీసీ (యానిమల్ బర్త్ కేర్) చేయించి చేతులు దులుపుకునే ఆలోచనలో మున్సిపల్ అధికారులు విమర్శిస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



మున్సిపాలిటీలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బయట తిరగాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఇటీవల పిచ్చికుక్క 8 మందిపై దాడి చేసింది. ఓ చిన్నారికి గాయాలయ్యాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి

– నజీర్, అయిజ

కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలి..



పెంపుడు కుక్కలకు యజమానులు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి. అదే విధంగా వీధి కుక్కలకు కూడా వ్యాక్సిన్ వేస్తే బాగుంటుంది. మున్సిపల్ సిబ్బంది వాటిని బంధించి పశువుల ఆస్పత్రికి తీసుకొస్తే వాటికి కూడా వ్యాక్సిన్ వేస్తాం. వ్యాక్సిన్ వేసిన కుక్కలు కరిస్తే ప్రమాదం తక్కువగా ఉంటుంది.

– వెంకట రాజు, ఇన్‌చార్జి పశు వైద్యాధికారి

ఏబీసీ చేయిస్తాం



మున్సిపాలిటీలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు అందుతున్నాయి. వాటి సంతతి తగ్గించేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తాం. ఇటీవలే ఏబీసీ సంస్థ వారితో మాట్లాడాం. త్వరలో వీధి కుక్కలకు ఏబీసీ చేయిస్తాం.

–సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

ఆలయానికి విరాళం అందజేత



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన పాండు అనే భక్తుడు ఆదివారం రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ బుకింగ్

అలంపూర్ రూరల్ : మండల పరిధిలో యాసంగి పంటలకు డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు మండల వ్యవసాయధికారి నాగర్జున్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట వివరాల నమోదుతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతులకు ఎరువుల వినియోగానికి సమాచారం ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కేటీదొడ్డి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కేటీదొడ్డి వాగు వైపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకుని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ శ్రీను, యజమాని వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అదుపుతప్పిన బైక్.. ఇరువురికి గాయాలు



ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఉండవెల్లి శివారులో బైక్ అదుపు తప్పి బోర్డును ఢీ కొట్టింది. ఆదివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కర్నూల్‌కు చెందిన యువకులు నావిద్, సులేమాన్ బైక్‌పై గద్వాల్ నుంచి కర్నూల్‌కు వెళ్తుండగా ఉండవెల్లి స్టేజీలో అదుపుతప్పి హైవే బోర్డును ఢీ కొట్టి కిందపడ్డారు. ప్రమాదంలో నావిద్ తీవ్రంగా గాయపడగా, సులెమాన్ ఎడమ కాలుకు ఫ్యాక్చర్ అయినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిని వారిని కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

సర్పంచ్ ఏకగ్రీవమంటూ ప్రచారం..!

మానవపాడు: మండలంలోని గోకులపాడు గ్రామంలో సర్పంచ్ ఏకగ్రీవమంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఆశావాహులు ఎదురు చూస్తున్న తరుణంలో ఐక్యంగా ఉన్న గ్రామాల్లో ఏకగ్రీవం చేయాలని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామస్తులను వివరణ కోరగా... గ్రామంలో డబ్బుల ప్రస్తావన రాలేదని, సోదర భావంతో ఏకగ్రీవం చేయాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

ఆత్మకూర్: మండల కేంద్రంలోని స్వయంభూ పరమేశ్వరస్వామి జాతర సందర్భంగా ముమ్మర ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ వెంకట నర్సింహరావ్, వైస్‌చైర్మన్ ఏపూరి యాదగిరిశెట్టి అన్నారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించి పరిసరాల్లో పెరిగిన ముళ్లచెట్లను జేసీబీ ద్వారా తొలగించారు. వారం రోజుల పాటు జాతర ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు వేలాదిగా జాతర ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి తెలుగు నాగేష్, పూజారి కర్ణసయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు నిరంతరం సాధన చేయాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చేందుకు క్రీడాకారులు నిరంతరం సాధన చేయాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండలంలోని కుటుకనూరులో గుంటి రంగనాథ స్వామి జాతర సందర్భంగా ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. క్రీడలు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిన్న రాములు, బిందాస్, ముక్తార్, మల్లేష్, బెంజిమెన్, బందె నవాజ్, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



ప్రదర్శనలు వీక్షిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అలంపూర్ : పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో అందరిని ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్లు కేఎస్‌వీ రవిప్రకాష్, సిద్దార్థ్ సంజయ్, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ఎక్స్‌పో ప్రారంభించారు. ప్రైమరీ విభాగంలో 168 స్టాల్స్, హై స్కూల్ విభాగంలో 180 స్టాల్స్ ప్రదర్శించారు. రాకెట్ లాంచింగ్ సిస్టమ్, రేస్ షీల్డ్, హైడ్రాలిక్ రాకెట్, వేస్ట్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, మూలధాతువుల ప్రాముఖ్యత తదితర ప్రదర్శనల గురించి విద్యార్థులు వివరించారు. సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందిస్తాయని, విద్యార్థులు స్వయంగా వివరించడం వలన జ్ఞాపక శక్తి పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నూతన మండలాలు ఏర్పాటు చేయాలి



బల్గెరలో కరపత్రాలు విడుదల చేస్తున్న అఖిల పక్షం నాయకులు

గట్టు : జిల్లాలో నూతన మండలాలు ఏర్పాటు చేయాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బల్గెర, మాచర్ల గ్రామాల్లో అఖిల పక్షం నాయకులు జిల్లా వ్యాప్తంగా నూతన మండలాల ఏర్పాటుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. సోమవారం గద్వాల వాల్మీకి భవనంలో నూతన మండలాల ఏర్పాటు కార్యాచరణ ప్రణాళిక రూపొందించే అంశంపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రామకృష్ణనాయుడు, మోహన్‌చంద్ర, ముక్కెరన్న, యేసురాజు, మాచర్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌తో నిత్యం అవస్థలు



అలంపూర్ చౌరస్తాలో ట్రాఫిక్‌తో నిలిచిన వాహనాలు

అలంపూర్ : అలంపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారి కూడలిలో ట్రాఫిక్ సమస్యతో నిత్యం ప్రయాణికులు, ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోడ్ల కూడలి అందులోనూ ఫ్లై ఓవర్ కూడా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోందని స్థానికులు తెలిపారు. ఆదివారం వాహనాలు ఒక్కసారిగా రావడంతో రోడ్డుపైనే వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూడలి ద్వారా అలంపూర్- రాయచూర్, హైదరాబాద్- బెంగుళూరు మార్గాల్లోని వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సెలవు దినాల్లో అలంపూర్ క్షేత్రానికి వచ్చే భక్తులు, యాత్రికుల తాకిడి అధికంగా ఉంటుంది దీంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. కూడలిలో ట్రాఫిక్ సమస్య లేకుండా తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు



ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

కేటీదొడ్డి: మండలంలోని గంగన్‌పల్లి గ్రామ శివారులో చెరువు నుంచి అక్రమార్కులు అడ్డూ అదుపు లేకుండా మట్టిని తరలిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. జేసీబీతో చెరువు గుంతల్లో పదుల సంఖ్యల్లో ట్రాక్టర్లు ద్వారా మట్టిని తరలించి చదును చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు అమరచింతకు ఎమ్మెల్యే రాక

అమరచింత: కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ నేపథ్యంలో సోమవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అమరచింతకు రానున్నట్లు తహసీల్దార్ రవియాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్దిదారులు సోమవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



కంచుపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మహేష్



లింగన్‌వాయి గ్రామంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటస్వామి

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు, తక్కశీల గ్రామాల్లోని ప్రజలకు ఎస్‌ఐ మహేష్ సైబర్ మోసాలపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైం, పోలింగ్ సరళి గురించి వివరించారు. ఎన్నికల సమయంలో అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రవి పాల్గొన్నారు.

పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో..

అలంపూర్ రూరల్ : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటస్వామి అన్నారు. మండల పరిధిలోని లింగన్‌వాయి గ్రామంలో ఆదివారం పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో డయల్ 100, రోడ్డు భద్రతా, సైబర్ క్రైం, మాదక ద్రవ్యాల వినియోగంపై జరిగే నష్టం, పోక్సో కేసుల పర్యవసానాల తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. వాహన దారులు తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, భరోసా సిబ్బంది శిరీష, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర కలశాభిషేకం



సహస్ర కలశాల ఊరేగింపులో భక్తులు



లింగం ఆకారంలో ఏర్పాటు చేసిన కలశాలు

ఉండవెల్లి: మాఘమాసంలో వచ్చే అరుద్ర నక్షత్రం పరమశివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో మండల కేంద్రంలో ఆదివారం 1008 కలశాలతో ఊరేగించి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం రామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనం, మహాన్యాసం, రుద్రస్నానార్చన నిర్వహించారు. శివ నామస్మరణ, భక్తి గీతాలతో రామలింగేశ్వర ఆలయం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, సాగర్ శర్మ, సుక్లా, సాయి, ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, శివ స్వాములు, పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ గోవిందరావు

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంపీడీఓ గోవింద్‌రావు సూచించారు. ఆదివారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఎంఈఓ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. వార్షిక పరీక్షలపై పలు సూచనలు, సలహాలు అందించారు. సమయాన్ని వృథా చేయకుండా చదువుతూ పరీక్షలను భయం లేకుండా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సబ్జెక్టుల వారీగా అనుమానాలు ఉంటే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి



ఎస్‌ఐకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి మాట్లాడారు. పట్టణంలో వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటడటంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు, అదే విదంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు వీరమ్య చారి, బీజేవైఎం ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

వేడుకగా ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకగా నిర్వహించారు. ఆదివారం 1976 నుంచి 1980 వరకు చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒకే వేదికలో కలవడంతో సంతోషంగా గడిపారు. సెల్ఫీలు దిగుతూ వారి అనుభవాలు పంచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లోకారెడ్డి, రఘురాములు శెట్టి, శర్నయ్య, సూర్యకాంతా రెడ్డి, సూరయ్య, వెంకటేశ్వర్లు, హనుమంతు, రఫీక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాల బలోపేతానికి సిద్ధం



సంస్మరణ సభలో మాస్‌లైన్ పార్టీ నాయకులు

అమరచింత: ప్రజా సమస్యలతో పాటు కార్మిక ఉద్యమాలను బలోపేతం చేయడానికి సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నారు. మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఆదివారం విప్లవ ఉద్యమ కార్యశీలి యాదగిరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెత్తందారుల దోపిడికి వ్యతిరేకంగా విప్లవ పోరాటాలు చేసిన కమ్యూనిస్ట్ యోధుడు యాదగిరని కొనియాడారు. నేటి యువత ఆయన చూపిన విప్లవ స్ఫూర్తితో పేదల పక్షాన పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రాజన్న, కురుమన్న, ఆశన్న, భక్తి , జిలాని పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న శ్రీహరి

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు గత 9 నెలలుగా వేతనాలు రాక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీహరి అన్నారు. కార్మికుల వేతనాలు చెల్లించాలంటూ చేపడుతున్న దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. 9 నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నాడని మండిపడ్డారు. సంబంధిత కాంట్రాక్టర్ వెంకటయ్య ఏజెన్సీ నిర్వహకులు కోతలు పెట్టడంతోపాటు గత ఏడాది ఆగస్టు నుంచి వేతనాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, భరత్, మోహినుద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ లేక.. రోడ్లపైనే మురుగు



వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగు

శాంతినగర్ : రోడ్లపై పారుతున్న మురుగుకు మోక్షమెప్పుడు వస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా మంజూరైన సీసీ రోడ్ల వెంట మురుగు కాల్వలు మంజూరు కాకపోవడం, గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు, వర్షపు నీరు సీసీ రోడ్లపై పారుతు ఇబ్బందికరంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్లకు డ్రైయినేజీ కాల్వలు మంజూరు కాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తూ కాలినడకన బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్ల వెంట డ్రైయినేజీలకు ప్రతిపాదనలు పంపి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.